
కథ

# ముంపేటి



బెల్ అయినట్టుంది. ప్రార్థన కోసం పిల్లలు ఉరుకుతున్నరు. లొల్లి తగ్గింది. లొల్లి చేయకుంటె పిల్లలు అందంగ ఉంటరు. చిన్నపిల్లల కండ్లు ఎంత ముద్దుగ ఉంటయో! జీడిగింజలోలె నల్లగుడ్లు, చూస్తుంటె మనసు నిండింది. చేపకండ్లు నీలాలకండ్లు, అన్నిటికీ మించి అమాయకంగా ఉన్న ఆ కండ్లను చూస్తున్న నా చెవుల "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" మోగింది. ప్రార్థన అయింది. ఎవల క్లాసుకు వాళ్ళు పోయింద్రు.

బి.వి.ఎన్.స్వామి

తెల్లారితె దసర సెలవులు. బడిల హాజరు పలచగ ఉంది. వచ్చిన పిల్లగాండ్లల్ల సెలవుల సంబురం. చిన్నా, పెద్ద పండుగ గురించే మాట్లాడుకుంటున్నరు. అంతటా పండుగ వాతావరణం. ఊరికి పోవాలని మా పిల్లల ఆలోచన. బట్టల కోసం ఆమె, డబ్బులకోసం నేను, ఒప్పందాలు కుదిరినయి. ఊరికి పోవుడు ఖాయం అయింది. పంటలు లేక కాపుదనపోల్లు, లాభాల్లేక కోమటోల్లు, ఏమీలేక మామూలు జనం పండుగకు తయారయింద్రు. ఎవరికి ఏమున్నా లేకున్నా అందరికి బతుకమ్మ ఉంది. దసరా ఉంది. పెత్రమాస నుంచి బతుకమ్మ పండుగ వరకు మధ్యల అర్రెం తప్ప వరుసగ సాయంత్రాలు ఆడోల్లు ఆడుకునే ఆట బతుకమ్మ. ఊరికి రాక చాన రోజులైంది. వచ్చినపుడు అందర్ని కలువాలని బయటవడ్డ.

"అంత మంచిదేనా" ఎదరుగ రాజిరెడ్డి.

"నమస్తే మామ, బాగేనా"

"అంత బీరిపోయి నడుత్తున్నావేంది"

"బాల్‌రెడ్డి ఉన్నాడా"

"వాడెటు వోతడు. పా..." ఇంటికి తీస్కపోయిండు.

పెద్ద బంగ్లా. కులం ఒకటి కాకున్నా చిన్నప్పటినుంచి మామ వరుసతో పిలిచెటోన్ని. బాల్‌రెడ్డి ఈయన కొడుకు. నాకంటె చిన్న. బంగ్లా అరుగుదాటి లోపలికి పోయినం. బిజీగా బాల్‌రెడ్డి.

"నమస్తే బావ" చూడంగనే నవ్విండు.

"ఏం జేత్తున్నవు"

"కనపడుతలేదా బావ. అట్ల కూసో"

అతని చుట్టూ పువ్వులు కుప్పలక్కుప్పలు ఉన్నయి. తంగేడు, గునుగు, పట్టుకుచ్చులు, పట్నంబంతి, పోకబంతి, కట్లపూలు, గోరంటలు, పార్వతీ పరమేశ్వర పూలు, గుమ్మడి ఇలా అనేక రకాలు తన చుట్టూ ఉన్నవి. గునుగు పూలు కట్టలు కట్టి రంగులద్ది అందంగా పేర్చుతున్నడు.

"ఎప్పుడచ్చినవు బావ"

"నిన్న మండలం బస్సుకు"

"కొడుకు, బిడ్డ మంచిగున్నరా"

"మంచిగనే ఉన్నరు. మీ పిల్లలు కనబడత లేరేంది"

"మా పిల్లగాండ్లు ఆడుకోను పోయింద్రు. మీ చెల్లె ఇంటెన్క వంట జేత్తుంది. అమ్మ దొడ్లె ఉన్నట్టుంది. బాపు మల్ల బజార్ల వడ్డట్టున్నాడు. మీ పట్నం ముచ్చట్లు చెప్పు".

"పట్నంల అన్ని ఉంటయి కని మాటలు, ముచ్చట్లు ఉండయి".

నాతో మాట్లాడుకుంటూనే బతుకమ్మ పేరుస్తున్నాడు. పెద్ద తాంబాలంల గుమ్మడి ఆకేసి, దాంట్ల ముందు గునుగు పూవు పేర్సిండు. అట్ల గునుగు, గునుగుపైన తంగేడు, తంగేడుపైన పట్టుకుచ్చులు, ఒక్కోటి రెండు మూడు కచ్చులు పేర్సిండు.

"ఇంట్ల బతుకమ్మ పేర్సుడు మొదలుపెట్టింద్రా. నీకు పేర్వత్తదా"

"నాకైతె పేర్వరాదు. పువ్వు దొరుకుత లేనట్టుంది"

"ఎట్ల దొరుకుతది. పల్లెటూరోల్లందరు పువ్వు కట్టలు కట్టి పట్నంల అమ్మనే వట్టిరి"

"అవును. పట్నంల బతుకమ్మ ఆడుడు బరువు అయితుంది"

"ఇక్కడ కూడ గట్లనే ఉంది. వానలు లేక నీల్లు లేక పువ్వు దొరుకుత లేదు"

"బతుకునిచ్చే బతుకమ్మనే మనకు బరువైతుంది"

"ఈ పండుగను ఎవలు పుట్టిచ్చింద్రో! ఎక్కడ లేంది ఇక్కన్నే ఎందుకున్నదో?

"యాష్టత్తున్నాదోయ్"

"లేకపోతేంది బావ. నడుములు గుంజంగా ఈ పేర్సుడేంది"

"నడుములు పోంగ వాల్లు ఆడరా!"

"మరి ఇంత తక్లీబు తోటి ఈ పండుగ చేసుకోకపోతేంది"

"ఎన్కట ఇంతకంటె కష్టం ఉండె. తుర్క రాజ్యంల బతుకుడు కష్టం ఉండె. రజాకార్లు అందర్ని వనికిచ్చింద్రు. తెలుగు మాట్లాడితె నరకం చూపెట్టింద్రు. బలవంతంగా మతం మార్పించిర్రు. అందుకె బతుకునే తల్లిగ చేసుకొని బతుకమ్మ ఆడుకున్నారు"

"ఆహా! గట్ల ఇది పండుగ కిందికి మారిందా"

"ఇంత కష్టంల గూడా, ఇన్నేండ్లనించి ఆడుతుంద్రంటె పండగ గొప్పతనం నీకు అర్థమయిందనుకుంటున్న"

"బావా! నా బతుకమ్మ పేర్సుడయిపోయింది" అనుకుంటూ బతుకమ్మ మీద గౌరమ్మగా పిల్సుకొనే గుమ్మడిపువ్వును పెట్టిండు.

"మొత్తానికి నువ్వు ఇగురం గలోనివోయ్. నన్ను ముచ్చట్లల్ల వెట్టి, నువ్వు పని చేసుకున్నావు" అనుకుంటూ లేచిన.

"ఎటు పోతవు ఆగు. మొన్ననే మన

పయ్యావు ఈనింగి. "జున్నుపాలు తాగిపో" అనుకుంట బతుకమ్మ ముందునుంచి లేచి ఇంట్లకు పోయిండు.

"అంత మంచిదేనా అన్నయ్యా" బాల్‌రెడ్డి భార్య.

"అంత బాగే. నువ్వు మంచిగున్నవా" పాల గ్లాసు తీసుకున్నా.

"పిల్లల చదువులు, ఆరోగ్యాలు బాగున్నయా"

"అంతా బాగుంది"

అందరి దగ్గర సెలవు తీసుకొని బయల్దేరిన. అప్పటికే సగం రోజు గడిచింది. సాయంత్రం ఐదు అయింది. "జజ్జనక్కజోం-జజ్జనక్కజోం" ఊర్లో మాదిగ డప్పుల చప్పుడు. బతుకమ్మలతో బయల్దేరుండ్రనే పిలుపు అది. అందరికంటే ముందు బయల్దేరిన. ఊరికి దక్షిణంల ఉన్న బతుకమ్మ కుంట దిక్కు నడిచిన. వెడల్పైన కుంట కట్టకు కింద పెద్ద మఱ్ఱి చెట్టు. ఆ మఱ్ఱి చెట్టు కింద నాలుగు బండ రాల్ల మధ్య కట్టమైసమ్మ. గుడికి దగ్గర్నే తూము. దానిమీద కూర్చున్న.

ఒక్కొక్కరే బతుకమ్మలను ఎత్తుకొని వస్తుండ్రు. అరగంటలో జనంతో కుంట నిండింది. అనేక గుంపులు. గుంపులోని ఒకామె పాట చెబుతుంటె మిగిలినోల్లు చప్పట్లు కొట్టుకుంట, అనుకుంట తిరుగుతున్నరు. నా తీరుగ చాలా మంది వచ్చి కూసున్నరు. గడుసు గుంపొకటి తిరుగుతుంది. చాలా రోజులకు తల్లిగారింటికి వచ్చిన స్నేహితురాండ్లు మాటల్ని కలెపోసుకుంటున్నరు. నా పక్కకు ఉన్న పెద్ద మనుషుల మాటలు వినపడుతున్నయి.

"రంగన్నా! ఈ యేడు తంగేడు పత్త లేకుంట పోయింది"

"గునుగు గట్లగట్లనే ఉన్నది. కట్లపూలైతె కనపడకుంట పోయినయి"

"కాలం పాడుగాను, కాలం గాకపాయె. తాగుదాం అంటె నీల్లు కరువాయె.

"నీల్లు లేక పొలం ఎండిపాయె. కుంట ఎండిపాయె. దినం ఎట్ల గడుత్తదో ఏమో"

"నివద్దేగనీ! నీల్లే లేకపాయె. బతుకమ్మను దేంట్ల ఏసుడు"

"పోయినేడైతె బాయి బొందలల్ల ఏసిండ్రు"

"కుంటకొసకు కొన్ని నీల్లు కనవడుతున్నయి. అందరు దాంట్లనే ఏత్తరు కావచ్చు"

"వానంటె పడకపాయె. మరి ఓట్లనాడు చెప్పిన ముచ్చట్లు ఏమయినయి"

"ఓట్లనాడు ఏం చెప్పిండ్రు"

"అగో! మర్సినవా"

"కోపమెందుకే. మర్సిన ముచ్చట చెప్ప రాదు"

"ఎత్తిపోతల పథకం అంటిరి. నీల్లు మల్లిచ్చి కుంట నింపుతమంటిరి. వరదకాల్వ ఇగచ్చె అంటిరి. అన్ని ఓట్ల ముచ్చట్లేనా"

"ఓట్ల కోసమెందుకయితదే. ఈ పనులు చేత్తరనే రెండు పార్టీలోల్లను, ఒక్కొక్కసారి గెలిపిత్తిమి. ఎవలు జేయకపోయిరి"

"అయినా ఈ పనులు ఒక్క మనోనితోనే కావు. పైనుంచెల్లి మద్దతు దొర్కాలె"

"ఇది ఒక్క మనూరి మనాది కాదు. మన ఇలాక అంత ఇట్లనే ఉన్నది. మరి నదులు లేవా అంటే రెండు పెద్ద నదులు, చాలా దూరం మన దగ్గర్నే పారుతున్నయి. అటు తూర్పు మొకాన చూత్తె ఎక్కడ పడితె అక్కడ

"ఎత్తిపోతల పథకం అంటిరి. నీల్లు మల్లిచ్చి కుంట నింపుతమంటిరి. వరదకాల్వ ఇగచ్చె అంటిరి. అన్ని ఓట్ల ముచ్చట్లేనా"

"ఓట్ల కోసమెందుకయితదే. ఈ పను లు చేత్తరనే రెండు పార్టీలోల్లను, ఒక్కొక్కసారి గెలిపిత్తిమి. ఎవలు జేయక పోయిరి"

"అయినా ఈ పనులు ఒక్క మనోనితోనే కావు. పైనుంచెల్లి మద్దతు దొర్కాలె"

అంగాంనీల్లు ఉన్నయి. ఈ కింది మీది ఎవారం ఏందో సమజయిత లేదు".

"ఏహె తీయే. సూత్తంటె ఈ రాజ్యంకంటె నైజాం రాజ్యమే మంచి గుండె అనిపిస్తంది".

వింటున్న నేను షాక్‌కు గురయిన. ఆట అయినట్లుంది. ఉన్న కొద్ది నీల్లల్లనే బతుకమ్మలు ఏసిండ్రు. అంతా అయినాంక "ఇస్తినమ్మ వాయినం- పుచ్చుకుంటి వాయినం" అంటూ ఇచ్చిపుచ్చుకున్న వాయినాలల్ల ఉన్న పెసర, గోధుమ, పల్లి, నువ్వు, బియ్యం పిండ్ల చేతులు మారినాంక ఇండ్లకు బయలుదేరిండ్రు. అట్ల బతుకమ్మ పండగ, రేవటి దసరాకు పండగ వాతావరణాన్నిచ్చింది.

** ** **

దసర సెలవులయినాంక మొదటిరోజు బడిలో హాజరు పలచగ ఉంది. మెల్లమెల్లగా సిబ్బంది పగటివరకు వచ్చిండ్రు. చెట్లకింద పిల్లలు ఆడుకుంటున్నారు. పగలు బడి మొదలైంది. పిల్లల హాజరు శాతం పడిపోయింది. ఉన్న పిల్లలతోటి ఏదో ఒక పని చేయించాలని చెట్లకిందికి పోయినం. మమ్ములను చూసి పిల్లలందరు బుద్ధిమంతుల తీర్గ కూసున్నరు. పిల్లలను పండుగ విశేషాలు చెప్పమన్నం.

"పాటలు... పాటలు" అని పిల్లల కేకలు.

"సరె ఎవరికేది వస్తె అదే కానీయిండ్రి" ఒప్పుకున్నం.

"సార్, నేను కైతికాల పోశెట్టి ఏషం ఏత్త"

"సరె కాని" ఒప్పుకున్న.

"అంటె ఏం చేస్తడు" మా టీచర్‌కు అనుమానం.

"ఏకపాత్రాభినయం చేస్తడు"

"పాత్ర క్యారెక్టర్ ఏంటి"

"కైతికాల పోశెట్టికి మూడెడ్లు, ముప్పై ఆరు దొడ్లు"

"ఆహా! అర్థమయింది"

కొద్దిసేపట్లోనే తలకు రుమాలు చుట్టుకొని, భుజంమీద తువ్వాల ఏసుకొని, నోట్లో మోదుగాకు చుట్ట పెట్టుకొని గుప్పుగుప్పున పొగ వదులుతూ కైతికాల పోశెట్టి వచ్చిండు. వచ్చుడుతోనే మాట్లాడుడు మొదలు పెట్టిండు.

"నన్ను గన్న తల్లిదండ్రికి, నాకు పిడికెడు బువ్వ పెట్టిన తల్లి బూదేవరకు, నన్ను పెంచి పెద్దజేసిన నా ఊరుకు, నా అక్కల ముక్కల ముచ్చట్లు ఇనే మీ అందరికీ సేనార్తులు. నాకు దోసిన ముచ్చెట్లు సెప్పుత! దయుంచుండ్లి!



దసుర పండుగంటె దోతులు, తెల్లంగీలు, నూనె రాసి పెంటర దూసుకోవటం, యాటను కొట్టటం, డప్పుసప్పుడు, సద్దుల బతుకమ్మ, సీదేవిసీరె, సిలుకపచ్చ రయికె

ఆ సీర కట్టుకొని ఉయ్యాలో
నీల్లకంట బోతె ఉయ్యాలో
సిలుకలన్ని గూడి ఉయ్యాలో
సీరంత సింపె ఉయ్యాలో

ఇచ్చుకో వైనం, పుచ్చుకో వైనం, సత్తుముద్దలు, పాపరగాయ గొట్టాలు, పరాసికాలు, సీకట్ల లేసుడు, తీరుతీరు పూలు, తీరొక్క పూలు, డప్పుచప్పుల్లు, జంబికిపోయి, జంబాకు తెంపుకునుడు, గద్దను సూసుడు, దానవ్వ కడుపుగాల ఏడ తిరిగినా నల్లపిట్ట, పాలపిట్ట కనిపిచ్చేది కాదు. పంబాలోల్ల జమిడికె "తీగవారె. తీగవారె లాయి రేణుకా, అమ్మ రేణుకా!" మల్ల దసురా పండగంటె జూన్నపోతలు, చిత్తకార్తి, చిత్తుబొత్తుజేసే ఎండలు, కత్తెర పెళ్ళలు, గొర్రు కట్టిన శాయిరి, జడ్డిగంల జొండ్ల గలగల, దాన్ని గుంటుకతోని రాసిన గొట్టుడు. ఒర్నియవ్వ దసురా పండుగ యాదికత్తె మనసు సుమ్మర్లు సుట్టుకపోతది".

అయ్యా! ఇదంత పండుగ ముచ్చట. ఇగ మా పర్సరాములు ముచ్చట సెప్పుత.

"ఆగాగు. చెప్పింది చాలు. ఇక నువ్వెళ్ళు" సైన్స్ సారు గద్దించాడు.

"అదే! ఏం తప్పు జరిగింది" ఆశ్చర్యంలో నేను.

"భాషండీ...భాష..."

"మనం మరచిన మన భాషలో చెబుతున్నాడు"

"ఆ భాషలోనే మన సిగ్గుపోతుంది. సినిమాల్లో ఈ భాష ఎవరు మాట్లాడుతారో తెలుసా"

"రౌడీలు, గూండాలు, విలన్లు మాట్లాడుతరు. సినిమాల్లలనే కాదు, అడ్వర్టయిజ్‌మెంట్లలో కూడా చెడు పాత్రలే ఈ బాష మాట్లాడుతవి"

"మంచి భాష, ప్రామాణిక భాష, పుస్తకంలోని భాష, నాగరిక భాష మనం మాట్లాడాలి. పిల్లలకు నేర్పాలి. ఇటువంటి చెడు ధోరణులు మాన్పించాలి"


"మీ అమ్మమ్మ, తాత ఏ తీరుగ మాట్లాడింద్రో నీకు గుర్తుందా అడిగాను.

"వాళ్ళు చదువుకోలేదండి. వాళ్ళ గొడవ ఎందుకు"

"వాల్లు చదువుకోక వాల్ల బాష మాట్లాడింద్రు. నువ్వు చదువుకొని నీ బాష మర్చిపోయినవు. అది తేడా"

"పుస్తకంలోని భాష కాని, నీవు పాఠం చెప్పేవేళ వాడే భాష కాని నీవేనా" ప్రశ్నించాడు.

"కాదు. ఎందుకు కాకుండా పోయిందో కారణాలు వెతకమంటున్న".



"బాగ తెలిసినోనివి కదా, నువ్వే చెప్పు"

"అగో! ఆ కారెడ్డం వద్దు. శ్రవణ, భాషణ, పఠన, లేఖన నైపుణ్యాలలో పిల్లవాడు బడికి వచ్చెసరికి శ్రవణ, భాషణ నైపుణ్యాలు కలిగి ఉంటున్నడు. మరి మనం వాటిని బడిలో కొనసాగిస్తున్నమా? వాడు నేర్చుకున్న బాషకు, బడిలో చెప్పే బాషకు తేడా ఉంటలేదా? చైల్డ్ సెంటర్డ్ ఎడ్యుకేషన్ సిస్టమ్‌లో ఈ విధానం ఎంతవరకు సమంజసం? "అయ్య అరకలో వచ్చాడు" అందామా, "నాయిన నాగలితోటి వచ్చిండు" అందామా. ప్రామాణిక భాష పేరున మీరు ఏ విధంగానైతె పోశెట్టిని ఈసడించుకున్నరో, అదేవిధంగా మన ప్రాంత ప్రజలు కూడా ఈసడింపబడుచున్నరు.

ఆమె నొసటి మీద బాసర సరస్వతి కనపడింది. ఆ కండ్లల్ల సమ్మక్క, సారలమ్మల పోరాట జ్యోతులు ఉన్నాయి. నిర్మల్ కొయ్య బొమ్మ ఒకటి ముక్కుపుల్లగా ముడుచుకొంది. నోరు భద్రాద్రిరాముని జపం చేస్తుంది. చెంపపై వద్ద సొట్ట హైదరాబాద్ లోని దూద్‌బౌలి తీరుగఉంది. జూరాల ఆమె నెక్లెస్‌గా కనపడింది. ఆమె సిగలో మంజీర నిద్ర పోతుంది. విశాలమైన ఛాతియందు సింగరేణి బొగ్గు గనులు విస్తరించినయి. కడుపుల మానేరు, నిజాంసాగర్ ఆడుకుంటున్నయి. నడుముకు గోదావరి ఒడ్డాణమైంది. ఆమె కాళ్ళు రెండు మినార్ల తీరుగ ఉన్నాయి.

ఈ ప్రామాణిక బాష ఎక్కడిది? ఎలా రూపుదిద్దుకొన్నది? అందుకోసం జరిగింది తెలుసుకుంటే అధికార భాషా రాజకీయాలు అర్థమవుతయి. ఈ ప్రాంతానికి చెందిన నీరు, భూమి, వ్యవసాయం, విద్య, లైబ్రరీలు, వనరులు, ఉద్యోగాలు ఏ విధంగానైతె రాజకీయాల బారినపడి దుమ్ముకొట్టుకపోయాయో అదేవిధంగా బాష కూడా కొట్టుకపోయింది. అందుకే ఈ ప్రాంతం వాడిపై ఉండికూడా పోశెట్టి బాషను నువ్వు తప్పుపట్టినవు. అంతా పరాయిదయింది. మన ప్రాంతాన్ని, మన వనరుల్ని, బతుకుల్ని రక్షించుకోవడం కోసం, వచ్చి పడుతున్న గ్లోబల్ ముప్పును తప్పించుకోవడం కోసం స్థానిక స్పృహను పెంచుకోవాలె".

"స్థానిక స్పృహ, స్థానిక వనరులపై పట్టు అంటూ మీరు సమైక్యతకు గండి కొడుతున్నరు"

"నాకెందుకులే అనేది నరనరాన నిండిన మీరు ఆదర్శం గురించి చెపుతున్నరా! నేను, నాది, నా కుటుంబం అన్నప్పుడు లేని తప్పు నా ప్రాంతం అంటే వచ్చిందా? ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విఫలమయిన తరువాత, అంతకంటె మెరుగయిన చిన్న కుటుంబ వ్యవస్థ ఆచరణలోకి వచ్చింది. అధికార వికేంద్రీకరణ అనేది ఎంత ఎక్కువగా జరిగితే ప్రజాస్వామ్యం అంత బలం పుంజుకుంటది. ఏదో ఒక ఆశయాన్ని చూపించి అభిప్రాయాలను తప్పు పట్టడం మంచిది కాదు".

బడిలో జరిగిన సంఘటనలు రాత్రి నిద్రను దూరం చేసినయి. పుస్తకం తీసిన, పక్కకు పెట్టిన, టీ.వి. ఆన్ చేసిన, చకచకా ఛానల్స్ మార్చిన. ఎక్కడా నా ప్రాంత జీవితం లేదు. అంతా పరాయి. అబ్బ...తల నొప్పి. లోలకం...పన్నెండు కొట్టింది. ఇంటా, బయట చీకటి చప్పుడు. స్విచ్ ఆఫ్ చేసి కండ్లు మూసుకున్న. పడకపై దొర్లుతూ... చాలా సేపు.

** ** **

"బాబూ!" మెత్తగా పిలిచింది.

కండ్లు తెరిచిన. ఎదురుంగ స్త్రీ ఆకారం. ప్రేమ నిండిన కండ్లతో తనలోని దయను నాలో నింపింది. అమృతం తాగినట్లయింది. ఏండ్లుగా కోరుకున్న చేయి దీవించినట్లుంది. ఇంతలో ఆమె మాట్లాడింది.

"బిడ్డా! ఎందుకంత దుఃఖం"

నా కండ్లల్ల నీల్లూరినయి.

"తరాల నా వేదనంతా నీలో చూస్తున్నా"

నన్ను చదివినట్టుంది. సంతోషమయింది.

"కన్న బిడ్డలందరూ నా బాధ గుర్తించనివేళ, నీ యాతన నన్ను నీవద్దకు చేర్చింది" నాపై కురిసిన తల్లి తనానికి తడిసీముద్దయిన.

"నీలాంటివారే. నీ అన్నలు, అక్కలు, తాత

లు, తండ్రులు తిరిగి నా కడుపులోకి వచ్చి చేరింద్రు. వాళ్ళు నీకు గుర్తున్నరా"

"కొడుకా! ఆవేదనొక్కటే చాలదు. ఆచరణ ముఖ్యం".

నేను బలహీనుణ్ణి. గట్టిగా చెప్పాలనిపించింది. గొంతు పెగలలేదు.

"ప్రపంచం బాధ అంతా నీదేకదా! నీవు ఒంటరివి కావు"

బుద్ధుణ్ణి విన్నట్లనిపించింది.

"తండ్రీ! మాట్లాడవెందుకు. నాతో మాట్లాడు"

గొంతులో నిలిచిన మంచుముక్క ఏమీ మాట్లాడనీయడం లేదు. పైగా అది కరుగుతూ కండ్ల నుంచి కారుతుంది.

"వల్లమాలిన సౌజన్యం అనర్థదాయకం. నన్ను చూడు" అంటూ సంకెళ్ళతో ఉన్న చేతుల్ని చూపెట్టింది.

చూసిన. పరేషానైన.ఒక చేతిపై పచ్చబొట్టుతో పొడిపించుకున్న బొమ్మ. ఎవరతను? ఎవరు? ఎవరు? నా బుర్ర బూగోళమయింది. యాదికొచ్చిండు. అవును. అతడే "హైమన్ డార్ఫ్". నాలో నేను అనుకొన్న. మరో చేతిపై పొడిపించుకున్న అక్షరాలను కూడిన.

"పా...ల్కు...రి...కి....సో....మ...న"

బీరిపోయి బారెడైన.

"నిజంకన్నా! వీళ్ళిద్దరిలో ఒకరు నా పెంపుడు కొడుకు. మరొకరు నా కన్నతండ్రి లాంటివాడు. ఇప్పుడు చెప్పు వీరిలా నీవు ఎదగాలనుకోవడం లేదా? వేదనపు ముద్దగా మిగలాలనుకుంటున్నావా?

నాలోని అనవసరమైన తడి ఇగిరిపోయింది.

"చూడు. నన్ను దగ్గరగా చూడు. నన్ను చూసి అర్థం చేసుకొనే ప్రయత్నం చేయి" అంటూ దగ్గరగా, కంటికి దగ్గరగా వచ్చింది.

ఆమెను దగ్గరగా చూసిన నా వెంట్రుకలు నిక్కబొడిచినయి.

ఆమె నొసటి మీద బాసర సరస్వతి కనపడింది. ఆ కండ్లల్ల సమ్మక్క, సారలమ్మల పోరాట జ్యోతులు ఉన్నాయి. నిర్మల్ కొయ్య బొమ్మ ఒకటి ముక్కుపుల్లగా ముడుచుకొంది. నోరు భద్రాద్రిరాముని జపం చేస్తుంది. చెంపపై పడ్డ సొట్ట హైదరాబాద్‌లోని దూద్‌బౌలి తీరుగ ఉంది. జూరాల ఆమె నెక్లెస్‌గా కనపడింది. ఆమె సిగలో మంజీర నిద్ర పోతుంది. విశాలమైన ఛాతియందు సింగరేణి బొగ్గు గనులు విస్తరించినయి. కడుపుల మానేరు, నిజాంసాగర్ ఆడుకుంటున్నయి. నడుముకు గోదావరి ఒడ్డాణమైంది. ఆమె కాళ్ళు రెండు మినార్ల తీరుగ ఉన్నాయి.

మానవ రూపంలో వచ్చిన ప్రకృతికిని చూడంగనే లోపలి దుఃఖం బద్దలైంది. ఆనందం, ఆశ్చర్యం, అయోమయం కలెగల్సిన స్థితి నాది. ఆ క్షణంల అమాయకంగా నా నుండి వచ్చిన ఒకే ఒక మాట–

"తల్లీ! నీ పేరు....?"

ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్‌మని అలారం మోగింది.

కండ్లు తెరిచి చూసిన. కన్నది కల అని మెలకువ తెలిపింది. కలను నిజం చేసుకోవాలని ఆశ. ఆశతోటే లేచిన. రొటీన్ పనులు జరుగుతున్నయి. మా పెద్ద కొడుకు "మా తెలుగు తల్లి" గీతం బట్టీ పడుతున్నడు.

"ఇవ్వాల ప్రార్థన నువ్వే చెబుతున్నావా"

"కాదు. మా సారు ఇది అప్పజెప్పమన్నడు" అంటూ కాగితం ఇచ్చిండు.

కాగితం అందుకొని చూసిన. "మా తెలుగుతల్లి" గీతం ఉంది. పాటలో కొత్తదనం కనిపించింది. చదువుడు మొదలుపెట్టిన.

.... ... ....

.... ... ....

"రామప్ప గుడిలోని రమ్యమౌ శిల్పాలు
గోపన్న గొంతులో తారాడు గీతాలు
పోతన్న కలములో తీయందనాలు"

.... ... ....

పాతలో కొత్తదనాన్ని నింపిన సార్‌ను కలువడానికి బయల్దేరిన.

# నా కలలు సాయుధులు

లోపలికీ బయటికీ
నిరంతరంగా సాగుతూ పారుతున్న వాగులా ఆలోచన...

***

గదిలోకి తొంగి చూస్తూ
ఆకాశం ఏదో మాట్లాడుతుంది
చెవి ఒగ్గి వినడం, మరల లోలోకి వెళ్ళడం

కుట్లు కుట్టుకుని అతికించుకున్న చర్మంలా
బరుకుగా వుంది లోలో...

1
ఎవరు నాతో మాట్లాడుతుంది!
ఎవరితో మాట్లాడ్డం కోసం నేనిక్కడ వేచివున్నాను

2
కళ్ళముందు భారంగా కదుల్తూ
ఏదో మాట్లాడేందుకు నిద్రలా ముంచుకొస్తున్న
రాత్రికోసం ఎప్పట్లానే వేచివున్నాను
కల- రాత్రి భాష.
కలలుకనే వాళ్ళంతా సజీవులు

3
ఇరాక్ యుద్ధ అవశేషాల్ని
నాలోకి వెలికితీసి అలిసిపోయాను
నన్నో దేహంలేని దేహంలా మార్చిన
గుజరాత్ గాయాలతో మాట్లాడుతున్నాను.

దున్ని దున్ని అలిసిపోయి
నెర్రెలిచ్చిన రైతు స్వప్నంలోనే మిగిలున్న భూమితో
సంభాషిస్తున్నాను.
మంతనాలు, విప్లవాలు, ఆయుధాలు...
నన్నో ఆయుధంలా చేబూనిన కాలంతో చర్చలు జరుపుతున్నాను.
భవిష్యత్తు కలల్ని కంటున్న నా కళ్ళ భద్రత కోసం
రక్షణ కావాలని అడుగుతున్నాను.

ఇక చర్చించుకుందాం రండి!
ఇప్పటికైనా నాతో మాట్లాడాలనే ఆలోచన రావడమే
నా విజయం.

4
నా కలలు సాయుధులు-
మీతో మాట్లాడ్డం కోసం నేను సాయుధంగా వస్తాను.
నేను మసీదులా వస్తాను
'అజా' చేస్తూ తలఎత్తి ఆకాశంవైపు చూస్తున్న
పరిశుద్ధ మానవుడిలా వస్తాను.

ఆకాశం నాతో ఏదైనా మాట్లాడకముందే
మీకో అవకాశం ఇస్తున్నాను.
మాట్లాడ్డం కోసమే నేనిక్కడ వేచివున్నాను.
ఇంతకీ
మీరు ఎవరు? మీతో ఎవరు? మీలో ఎవరు?!

– యాకూబ్